# నేను మీ బిడ్డను..

- పెత్తందారులు నన్ను ఓడించాలని కుట్రలు చేస్తున్నారు
- మరోసారి మీ దీవెనలు అందించండి
- అచ్చంపేటను ఆగం కానివ్వొద్దు
- గ్యారెంటీ స్కీంల పేరుతో కాంగ్రెస్ మోసం
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- గ్రామగ్రామాన ప్రజల నీరాజనం



కోనేటిపూర్‌లో వృద్ధుడి వద్ద ఆశీర్వాదం తీసుకుంటున్న విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట, అక్టోబర్ 20 : నేను మీ బిడ్డను.. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు అచ్చంపేట ప్రజల కోసమే బతుకుతా.. చస్తే అచ్చంపేట ప్రజల కోసమే చస్తా.. అంతే కాని ప్రజాసేవను వీడను.. పెత్తందారులు, హైదరాబాద్‌లో ఉండేవారు, ఒక్కటయ్యారు.. ఎలాగైన నన్ను ఓడించి తీరుతారట.. వాళ్ల అక్రమ దందాలను అడ్డుకున్నందుకు, వారి పెత్తనానికి మద్దతు పలకనందుకు నన్ను ఓడించేందుకు ఎన్ని డబ్బులైనా ఖర్చుపెట్టి ఓడిస్తారట.. దయచేసి ప్రజలు గమనించాలి. ప్రశాంతంగా ఉన్న అచ్చంపేటను దోపిడీదారులు, కుట్రదారులు చేతిలో పెట్టి ఆగం కానివ్వొద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడోసారి ఎన్నికల బరిలో నిలిచి బీఫారం అందుకొని ప్రజల్లోకి వెళ్తున్న గువ్వల బాలరాజును ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు. ఊరూరా గులాబీ జెండాకు జై కొడుతున్నారు. పేదల బిడ్డ గువ్వల బాలరాజును గెలిపించుకుంటామని బాహటంగా చెబుతున్నారు. గువ్వలపై పూలు చల్లి బతుకమ్మ, కోలాటాలతో స్వాగతం పలుకుతూ అభిమానం చాటుకుంటున్నారు. ఏ గ్రామంలో చూసినా గులాబీ పార్టీకి వృద్ధులు, మహిళలు, రైతులు, సబ్బండవర్గాలు మద్దతుగా నిలబడుతున్నారు. సచ్చినా సీఎం కేసీఆర్‌కే ఓటేస్తామని మహిళలు ప్రకటిస్తున్నారు. గువ్వల ప్రజలను కలుస్తూ పేరు పేరున పిలిచి పలకరించారు. వృద్ధులు, వయస్సు మగ్గిన వారి వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. జయించి వస్తావు పో బిడ్డ అంటూ దీవించి పంపించారు. బొట్టు పెట్టి తిలకం దిద్ది మహిళలు ఆశీర్వచనలు అందించారు. ఎప్పుడు పేదల కోసం ఆలోచించే గువ్వల బాలరాజు బిడ్డను గెలిపించుకుంటామని ప్రజలు బాహటంగా ప్రకటిస్తున్నారు.

### మీ సేవకుడై ఉంటా..

వంగూరు, అక్టోబర్ 20 : మూడోసారి నన్ను ఆశీర్వదిస్తే మీ సేవకుడై ఉంటూ కుటుంబానికి పెద్దదిక్కునై సేవలందిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కోనేటిపూర్, తిప్పారెడ్డిపల్లి, గాజర, నిజాంబాద్, ఉమ్మాపూర్, ఉప్పల్‌పహాడ్ గ్రామాల్లో విప్ గువ్వల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాలు కాంగ్రెస్ వైపు ఉంటే అగ్రవర్ణాలలోని పేదలు, దళితతులు, బడుగు బలహీన వర్గాలతోపాటు మైనార్టీలు నా వెంట ఉన్నారన్నారు. వారు డబ్బులను నమ్ముకుంటే, నేను నిజాయితీని, పనిని నమ్ముకున్నానన్నారు. వారు ఆరు గ్యారెంటీ స్కీంల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు మీ ముందుకు వస్తున్నారని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. వంగూరు మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో 30వేల ఎకరాలకు సాగు నీరు అందించానని మరికొన్ని గ్రామాల్లో మరో 12వేల ఎకరాలకు సాగు నీరు అందేలా కృషి చేస్తానన్నారు. నేడు మండలంలోని అన్ని గ్రామాల రోడ్లను బీటీగా మార్చడమే కాకుండా గ్రామాల్లో వీధులన్నీ సీసీలుగా మారి అద్దంలా మారాయన్నారు. వందల కోట్లతో అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, ఇది చూసి ప్రతిపక్షాల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కొందరు స్వార్థపరులు పార్టీ మారినంత మాత్రాన ఒరిగేదేమీలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పేద మహిళలకు నెలకు రూ.3 వేలను అందించడంతో పాటు వంటగ్యాస్ రూ.400 అందిస్తామన్నారు. అచ్చంపేటలో మరోసారి కారు గుర్తును గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందించాలని కోరారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

వంగూరు మండలంలోని చౌదర్‌పల్లి,ఉమ్మాపూర్ గ్రామాల్లో 30 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన విప్ గువ్వల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చౌదర్‌పల్లిలో కాంగ్రెస్‌కు చెందిన 20 మంది కార్యకర్తలు మండల నాయకుడు నాగేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఉమ్మాపూర్‌లో కాంగ్రెస్‌కు చెందిన అంకూరి రవితో పాటు మరో పది మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వీరికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, లాలుయాదవ్, సురేందర్ ఉన్నారు.



ఎమ్మెల్యే మర్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మమ్మాయిపల్లి కాంగ్రెస్ నాయకులు

# మరింత అభివృద్ధి చేస్తా..

- కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేసుకుందాం
- ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌ను ఆదరించాలి
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- గులాబీగూటికి చేరిన కాంగ్రెస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబర్ 20 : నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, మరో సారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సీతారామరాజుతో పాటు పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే మర్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ నిలిచిందని, ఈ రోజు దేశం మొత్తం కేసీఆర్ పథకాలు కావాలని కోరుతున్నారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి గడపకు చేరాయని, అందుకే ప్రజలందరూ మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించి సీఎం కేసీఆర్‌ను మరో సారి ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కా రాజుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన మమ్మాయిపల్లి నాయకులు

బిజినేపల్లి, అక్టోబర్ 20 : మండలంలోని మమ్మాయపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మహబూబ్, బంగారయ్యలతోపాటు మరో 20 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు ప్రకటించారు. అనంతరం మండలంలోని వెలుగొండలోబుడ్డయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ చైర్‌పర్సన్ స్వాతీకిరణ్, విండో చైర్మన్ బాలరాజుగౌడ్, వైస్ఎంపీపీ చిన్నారెడ్డి, వెంకటయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

# కాత్యాయనీ.. శుభప్రదాయనీ

- ప్రత్యేక అలంకారంలో శ్రీశైల భ్రామరీ
- హంసవాహనంపై మల్లన్న దంపతులు
- కనులపండువగా పుష్పపల్లకీ సేవ



కాత్యాయనీగా దర్శనమిస్తున్న జోగుళాంబ

శ్రీశైలం అక్టోబర్ 20 : శ్రీశైలంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆరవరోజు శుక్రవారం భ్రమరాంబాదేవికి కాత్యాయనీ అలంకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ఈ దేవి నాలుగు చేతుల్లో వరముద్ర, పద్మం, అభయముద్రలు, ఖడ్గాన్ని ధరించి సకల శుభప్రదాయని కాత్యాయనిమాతగా భక్తులకు దర్శనమిచ్చింది. కాత్యాయనీ అమ్మవారిని దర్శించడం వల్ల జన్మజన్మ పాపాలన్నీ హరింపబడతాయని పండితులు చెబుతున్నారు. సాయంత్రం అక్కమహాదేవి అలంకారమండపంలో భ్రామరి సమేత మల్లికార్జున స్వామివార్లను హంసవాహనంపై అధిష్టింపజేసి అర్చక వేద పండితులు విశేష పూజలు జరిపించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతోపాటు దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మహా సంకల్పాన్ని పఠించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రాకారోత్సవం, గ్రామోత్సవంలో భాగంగా పుష్పపల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. వివిధ రకాలైన ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామిఅమ్మవార్లను అధిష్టింపజేసి షోడశోపచార పూజాధికాలు చేశారు. కార్యక్రమం లో ఈవో పెద్దిరాజు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఈఈ రామకృష్ణ, ఏఈవో మోహన్, హరిదాస్ అధికారులు పాల్గొన్నారు.

### కాత్యాయనీదేవీగా జోగుళాంబ

అలంపూర్, అక్టోబర్ 20 : అలంపూరులోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు శోడశోపచార, ప్రదోషకాల పూజలు, చండీహోమాలు, త్రిశతి అర్చన, సాయంత్రం సహస్రనామార్చన, రాత్రి ఏడు గంటలకు దశవిధ హారతుల అనంతరం అమ్మవారు కాత్యాయనీగా దర్శనమిచ్చారు. ఆలయాలను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశం
- బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్,అక్టోబర్ 20 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావుతో కలిసి ఎమ్మెల్యే బీరం మాట్లాడారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అందులో మచ్చుకు కల్యాణలక్ష్మి, బీసీ బంధు, దళిత బంధు లాంటి వాటిని ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 24గంటల కరెంటు, రూ.2,016లు పింఛన్లు అమలులో లేవు. అక్కడ అందించని కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణలో ఎలా అమలు చేస్తారని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ చేరాలా విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రశ్నించాలన్నారు. ప్రతి గ్రామానికి మనం కరోనాతో రెండేండ్లు ఇబ్బందిపడినప్పటికీ మూడేండ్లలో జరిగిన అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామానికి సంబంధించిన సమాచారం అందించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరూ అసభ్య పదజాలాన్ని వాడకుండా సున్నితంగా ప్రతి ఒక్కరికీ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీపీ భోజ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు గుజ్జుల పరమేశ్‌నాయుడు, సురేందర్‌గౌడ్, తాళ్ల పరశురాంగౌడ్, చంద్రశేఖరాచారి పాల్గొన్నారు.

### అందరికీ సముచిత స్థానం

పెంట్లవెల్లి, అక్టోబర్ 20 : పెంట్లవెల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు శుక్రవారం హైదరాబాద్‌లో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గోవురాజు మాట్లాడుతూ 18 ఏండ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఐదేండ్లలోనే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సీఎం కేసీఆర్ సహకారంతో 70 ఏండ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపించారన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై అభివృద్ధిలో మేము భాగస్వాములు కావాలన్నా సంకల్పంతో బీఆర్ఎస్ చేరుతున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ రాష్ట్రం సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని విజయతీరాలకు చేరుస్తాయన్నారు. బీఆర్ఎస్‌లోకి ఎవరు వచ్చినా సాదరంగా ఆహ్వానిస్తామని, అందరికీ సముచిత న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేషేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లశెట్టి ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

కొల్లాపూర్, అక్టోబర్ 20 : పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన ఇమ్రాన్, గిరిధర్‌తోపాటు కొల్లాపూర్ పట్టణంలో 10వ వార్డుకు చెందిన 35మంది యువకులు కొల్లాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.